

కథల్రాయాలన్న కోరిక నాకు మొట్టమొదటిసారిగా హైస్కూల్లో థర్డుఫారం చదువుతున్నప్పుడు కలిగింది. మా స్కూల్లో కథలపోటీ పెట్టారు. కథలు వ్రాయడమనేది గొప్ప విద్య అనీ—అది పుట్టుకతో అబ్బవలసినదే తప్ప మరోలా రాదనీ అభిప్రాయపడి నేనా పోటీలో పాల్గొన లేదు. అయితే ఆ పోటీలో బహుమతి రామనాధానికి రావడంతో నా అభిప్రాయాలన్నీ తలక్రిందు లయ్యాయి.

రామనాధం నా క్లాసు మాత్రమే కాదు. క్లాసులో కూడా నా పక్కనే కూర్చుంటాడు. తెలివితేటలకు మార్కులే కొలబద్ద అనుకునే పక్షంలో అతను నాకంటె తెలివైన వాడు కాదు. ఏవరేజ్ స్టూడెంటతను. తెలుగు కాంపోజిషన్ నా స్థాయిలో వ్రాయాలన్నది అతని కోరిక. నేను కవినో రచయితనో కావలసి ఉందనీ భాషను నేను వ్రాసే శైలిలో వ్రాయగలగడం ఎంతో మందికి కానీ సాధ్యపడదనీ రామనాధం నన్ను తరచుగా మెచ్చుకుంటూండేవాడు. కథల పోటీలో పాల్గొనవలసిందని రామనాధం నన్ను మరీమరీ ప్రోత్సహించాడు. అప్పుడు నేను చలించలేదు. కానీ అతనికి బహుమతి వచ్చేక మాత్రం చలించాను. రామనాధం తనకు బహుమతి వచ్చిందని గర్వపడలేదు. నేను పోటీలో పాల్గొని ఉంటే ఈ బహుమతి నాకేవచ్చి ఉండేదని, ఏ విషయంలోనైనా తను నా తర్వాతనేననీ, ఈ మాత్రం వ్రాయడం కేవలం నా సావాస ఫలితంగానేననీ అతనన్నప్పుడు-ఆ మాటల్లో అతని వినయం, సహృదయతలకు బదులుగా—నా గొప్పతనాన్ని మాత్రమే చూశాను.

రామనాధం వ్రాసిన కథ చదివాను. చాలా పేలవంగా ఉన్నట్లు తోచింది. అందులో నాకనిపించిన లోపాలు నిర్మొహమాటంగా రామనాధానికి చెప్పగా

# అనుకూల వాతావరణం

వసుంధర

(7)

ఆతను మారు మాట్లాడకుండా అన్నీ ఒప్పేసుకుని—"నువ్వు మంచి కథకుడివే కాదు. విమర్శకుడివికూడా"—అని మెచ్చుకున్నాడు.

నా బుర్రలో ఎన్నో కొత్త ప్లాట్లున్నాయి. అన్నింటికీ కథల రూపాలనివ్వాలనుండేది. కానీ అందుకు వీలుపడేదికాదు కారణం వేరేలేదు. నా చిన్నతనంలోనే తల్లిపోయింది. నాన్న వేరే వివాహంచేసుకున్నాడు. మా నాన్న రెండో భార్యను నేను అమ్మా అనే పిలిచేవాడిని కానీ కేవలం మా ఇద్దరిదీ భౌతికమైన అనుబంధంగా వుండిపోయేది. తను నాకు అమ్మ అనిపించేలా నా సవతితల్లి ఎన్నడూ మసలేది కాదు.

మా క్లాసు మొత్తానికి నేనే తెలివైనవాడినన్నది నిర్వివాదాంశం. స్కూల్లో నాకున్న మంచిపేరు ఈ కొత్త అమ్మకు నచ్చేదు. నా చదువు సాగకుండా ఉండేందుకామె నాకు ఎన్నో పనులు చెప్పేది. చదువుకునేందుకు—ఇంటివద్ద నా కున్న సమయం అతి స్వల్పం. అందులో కొంత సమయాన్ని కథలకు వినియోగిస్తే చదువు సున్నా చుడుతుంది.


నా తెలివి తేటలతో భవిష్యత్తుకొక బంగారుబాట ఏర్పరచుకోవా లన్నది నా ఆశయం. అందుకే నాలోని కవితావేశాన్ని బైటకు రానివ్వకుండా ఎలాగో నొక్కిపట్టి హైస్కూలు చదువు పూర్తిచేశాను.

నాది చాలా దురదృష్ట జాతకమనుకుంటాను. హైస్కూలు చదువు పూర్తయ్యే సరికి—మా ఊళ్ళో కొత్తగా కాలేజీ వెలిసింది. కాలేజీ చదువులకైనా సవతి తల్లి బాధలు తొలగిపోతా యనుకున్నాను. మనసులో విచారిస్తూనే మా ఊరి కాలేజీలో చేరాను.

కాలేజీలో చేరాక ఇంట్లో నాకు పూర్వంమీద కొత్త స్వతంత్రం వచ్చింది. ఇంట్లో మరీ ఇదివరకటంత పని ఉండడం లేదు. అదీకాక నా కిద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లాయీ ఉన్నారు. వాళ్ళకు నేనంటే చాలా ఇష్టం. మా స్నేహమూ, ప్రేమాభిమానాలూ — నా సవతి తల్లిలో కూడా రవంత మార్పు తీసుకువచ్చాయి.

ఇంటికి పెద్ద కొడుకును నేను. చదువు బాగా వస్తోంది. మాకేమీ వేరే ఆస్తిపాస్తులు లేవు. నాన్నగారు రిటైరైపోతే ఈ సంసార భారం నాదే. అమ్మలో వచ్చే మార్పుకిదే కారణమనుకుంటాను.

నన్ను చాలా దృశ్యాలు కదిలిస్తున్నాయి. అడుక్కునే వాళ్ళను చూసినప్పుడూ, రిక్షావాళ్ళను చూసినప్పుడూ నా హృదయంలో ఏదో మూల కలుక్కుమంటుంది. ఏదోగేయంలాంటిది మెదుల్తుంది. వెంటనే వ్రాయాలనుంటుంది. కానీ నాకు చాలామంది స్నేహితులున్నారు. వాళ్ళు సృష్టించే వ్యాపకాలున్నాయి. నాకున్న కొద్ది సమయమూ వీటికే చాలడంలేదు. కథలుకానీ, గేయాలుకానీ వ్రాయాలంటే కాలేజీలోకూడా మధ్య మధ్య తీరుబడి వస్తూంటుంది కానీ ఆ సమయాల్లోఎక్కడో మూల కూర్చుని వ్రాసుకోడానికి బదులు-స్నేహితులమధ్య చర్చలు జరపాలని ఉండేది. ఆ చర్చలు చాలా మజాగా ఉంటాయి. వాటిలో మేష్టర్లుంటారు, ఆడపిల్లలుంటారు, సినిమాలుంటాయి-ఇంకా




ఏవేవో ఉంటాయి. ఈ చర్చల ఆకర్షణలో- రచనలు చేయాలన్న ఆవేశం మరుగున పడిపోయింది.

మా కాలేజీకి ఫస్టుగా బీయస్సీ ప్యాసయ్యాను. నా తర్వాత చదువుగురించి చర్చ వచ్చింది. ఏదో ఉద్యోగం చూడమంది అమ్మ. నాన్నమాత్రం కష్టపడైనా సరే ఎమ్మెస్సీ చదవాలన్నాడు. దానిమీద ఇంట్లో వాగ్వివాదాలు జరిగాయి. ఏదేమైనా నేను మాత్రం చిట్టచివరకు పై చదువులపేరుతో- విశాఖపట్నం చేరుకోగలిగాను.

రెండంటే రెండు సంవత్సరాలు కష్టపడితే చాలు—నా భవిష్యత్తుకు బంగారు బాట పడుతుంది. అందుకే నేను నాలోని కవితావేశాన్ని జోకొట్టి వాల్తేర్లో రెండు సంవత్సరాలు అహోరాత్రులుశ్రమించాను. ఫలితంగా నా సబ్జక్ట్‌లో యూనివర్సిటీకి ఫస్టువచ్చాను.

ఇప్పుడు ఇంట్లో మాత్రమే కాక బయట కూడా నా స్థానం పెరిగింది. నాకు వెతుక్కుంటూ పెళ్ళి సంబంధాలు రాసాగాయి. పెళ్ళిళ్ళ బజారులో నాన్న నా రేటుని చాలా పెంచేశాడు. మా అమ్మకూడా నా మీద ఆప్యాయత కురిపిస్తోంది. నాన్నగారు రిటైరు కావడానికింకా రెండు సంవత్సరాల వ్యవధి మాత్రమే వుంది.

ప్రొఫెసరుగారి ప్రోద్బలంమీద నేను ఉద్యోగ ప్రయత్నాలు వదిలి—రీసెర్చిలో జేరాల్సొచ్చింది. నెలకు మూడువందల రూపాయల స్కాలర్‌షిప్. అందులో వందరూపాయలు నాన్నకు పంపించేవాడిని. పీ హెచ్ డీ త్వరగా పూర్తి చేసుకుని ఉద్యోగం చేపట్టవలసిన బాధ్యత నాకున్నదని తెలుసును కాబట్టి రీసెర్చి

ఆడుతూ పాడుతూ చేయలేదు. మిగతా వారెవ్వరూ కష్టపడని విధంగా కష్టపడ్డాను. అందువల్ల రెండు సంవత్సరాల్లోనే నా వర్కు యించుమించు పూర్తయి పోయింది. అప్పుడు నా సీనియర్ ఒకతను థీసిస్ రాస్తున్నాడు. అందువల్ల ప్రొఫెసరుగారతని విషయం చూస్తూ చాలా బిజీగావున్నారు. ఈ కారణంగా నాకు కాస్త తీరుబడి వచ్చింది. రచనలు చేయడానికి చాలా మంచి అవకాశం. కానీ మళ్ళీ ఆటంకం వచ్చింది. నాకు పెళ్ళయింది.

కుసుమ నా జీవితంలోకి ప్రవేశిస్తూనే ఆవేశాన్ని తీసుకువచ్చింది. అయితే అది కవితావేశం కాదు. ప్రణయావేశం. కొన్ని నెలల పాటు నేను ప్రపంచాన్ని మరచిపోయి ఆమెతో విహరించాను. రచనలు చేస్తే సమయం వృధా అయిపోతుందని - క్షణం కూడా వృధా కాకుండా కుసుమతో గడపాలని నాకుండేది.


కుసుమ మైకంలో నేనింకా చాలా కాలం వుండాల్సి వచ్చేది కానీ పరిస్థితులు కుదరనివ్వలేదు. నా సరదాలకు నా రీసెర్చి స్కాలర్‌షిప్ చాలకపోవడం. ఇంటి బాధ్యతలు నాన్న రిటైరు కావడం మూలంగా పెరగడం అటుంచితే—నా స్కాలర్‌షిప్ గడువు పూర్తి కావస్తోంది. థీసిస్ గురించి కనీసం వెయ్యి రూపాయలు ఖర్చుచేయాల్సివుంది. నావద్ద ఏమీ మిల్వలేదు. స్కాలర్‌షిప్ అయిపోతే ఏమి చేయాలో నాకు తోచడం లేదు. ఈనగాచి నక్కల పాల్చేయడం నాకిష్టం లేదు. ఎలాగో థీసిస్ సబ్మిట్ చేయాలి. అదే సమయంలో నా ప్రొఫెసర్‌గారికి ఆరునెల్ల ఫారిన్ ఛాన్సు వచ్చింది. తిరిగి వచ్చేకగానీ నా థీసిస్ చూడడం వీలుపడదన్నారాయన.

వెంటనే ఉద్యోగ ప్రయత్నాలుమొదలు పెట్టాను. నెలకు నాలుగువందల జీతం మీద ప్రైవేట్ కాలేజీలో వుద్యోగం దొరికింది. ఖర్చు రోజుల్లో నా స్థాయి మనిషికి ఆ డబ్బు చాలదు. సంఘంలో నాకు హోదావుంది. కొత్తగా పెళ్ళయినవాణ్ణి. ఇంటి బాధ్యతలు. ఇవన్నీ కాక థీసిస్ గురించి డబ్బు నిలవేయాలి. పెళ్ళికి వచ్చిన కట్నం—పెళ్ళి ఖర్చులు పోగా—మిగిలినది నాన్న తీసేసుకున్నాడు. ఆయన కేవేవో ఖర్చుబడడం సహజం కదా!

అసలైన కష్టకాలం నాకు మొదలయింది. పైకి డాబుగా రోజులెలా గడిపానో నాకే తెలియదు. నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్న భార్య నాగురించి కోరికలు చంపుకుంటూంటే నాకది రంపపు కోతగా ఉండేది. ఉద్యోగం చేస్తూండగా వరుసగా రచనలు చేయవచ్చునని ఆశించిన నాకు బాగా ఆశాభంగమైంది.

కోర్కెలను చంపుకోవడంలో ఉన్న బాధ నాకు తెలిసింది. పేదవాళ్ళ కష్టాలకు అర్థం నాకు తెలిసింది. మధ్యతరగతి వాళ్ళ అసలు స్వరూపం కూడా నాకు తెలిసింది. ఇవన్నీ కలసి నాలో కొత్త భావాలు కొత్త ఊహలు కలిగిస్తూంటే—రకరకాల రచనలు చేయాలని నాకు అనిపించింది.

కానీ కష్టాలు నన్ను బాధిస్తున్నంత కాలమూ — వాటి నెలా నివారించాలా అన్న ఆలోచనలకు వినియోగించడంతోనే




సమయం అయిపోయేది. కష్టాల గురించి రచనలు చేయడానికి నాకు వ్యవధిలేదు.

నాది దురదృష్ట జాతకమే ఏమో - నా కష్టాలకు పెరుగుదలే కానీ, తరుగుతున్నట్లు లేదు. కుసుమ గర్భవతయింది. చెల్లెలు పెద్ద మనిషయింది. తమ్ముడు కాలేజీ చదువుల కొచ్చాడు. వీటిమధ్యనే నా థీసిస్ కూడా సబ్మిట్ చేయాల్సి వచ్చింది.

అన్నీ ఖర్చులే. అన్నింటికీ డబ్బు కావాలి. అప్పుడప్పుడు ఆత్మహత్య చేసుకోవాలనిపించేది. కానీ జీవితం మీద నాకింకా చాలా ఆశవుంది. ఆ ఆశ ఆత్మహత్య ప్రయత్నాల నాపు చేయించింది. అదీ మంచిదే అయింది.

సుమారు రెండు సంవత్సరాలు అన్ని కష్టాలూ పడ్డాక నానొక కంపెనీలో నెలకు పదిహేనొందల రూపాయల మీద ఉద్యోగం దొరికింది. ఉద్యోగం చాలా సుఖమైనది. కంపెనీ తయారు చేసే వస్తువుల క్వాలిటీ కంట్రోలు చూడాలి. కానీ నాకు నేనై స్వయంగా చేయవలసినదేమీ లేదు. రకరకాల టెస్టులు చేశాక టెస్టు రిపోర్టు నా దగ్గరకు వస్తుంది. అది సరైనదేనని నేను సర్టిపై చేయాలి. కంపెనీవారికి నా అర్హతలే కానీ సమర్థత అవసరంలేదు. ఏమైతే నా కెందుకు? నాక్కావలసింది డబ్బు.

రెండు మూడు సంవత్సరాలలో నాకు సంబంధించిన అన్ని కష్టాలూ తీరిపోయాయి. ఇప్పుడు ఏటా కంపెనీ వారిచ్చే బోనసు డబ్బుతో లగ్జురీ అయిటమ్సు కొనాలని నేనూ కుసుమా ప్లాన్సు వేస్తున్నాం. అప్పుడే వాయిదాల పద్ధతిమీద రిఫ్రిజరేటర్ కూడా కొనేశాం.

చెల్లెలికి పెళ్ళయింది. ఆ పెళ్ళికొక్కావల

సిన డబ్బు కంపెనీ నాకు అప్పుగా ఇచ్చి ప్రతినెలా నా జీతంలోంచి వందరూపాయలు చొప్పున కట్ చేసుకుంటోంది. ఒక తమ్ముడి చదువు పూర్తి కావస్తోంది.

జీవితం హాయిగా వుంది నాకు. భవిష్యత్తు బంగారులా అనిపిస్తోంది.

ఆఫీసులో నాకో ఎయిర్ కండిషన్డ్ రూముంది. రోజల్లా అందులోనే కూర్చుంటాను. నాకున్న పని చాలా తక్కువ. గవర్నమెంటుద్యోగం కంటె కూడా సుఖంగా వుంది నాకు.

ఇప్పుడు కథలు రాయడానికీ, రచనలు చేయడానికీ కావలసినంత తీరుబడి నాకు. ఆఫీసులో ఎయిర్ కండిషన్డ్ రూములలో కూర్చుని నాకున్న తీరుబడిని రచనలుగా మార్చడం మొదలుపెట్టాను.

చిన్నతనంలో రామనాథం నా గురించి అభిప్రాయం పడినది నిజమే— అచిర కాలంలోనే నేనొక మహా రచయితగా పేరు పొందాను. నా రచనల్లో కనబడే వాస్తవికత, శైలిలో కనబడే బలం, చాలా మందిని ఆకర్షించాయి. పేదప్రజల ఆకలి మంటలు, గొప్పవాళ్ళ దౌర్జన్యాలు, మధ్య తరగతి వారి త్రిశంకుస్వర్గం—ఇవీ నా రచనల్లోని ముఖ్యాంశాలు. ఎప్పుడో ఒక రోజున మహత్తర ప్రజాశక్తి దుష్టశక్తుల పైన తిరగబడి—సర్వమానవ సౌభ్రాతృత్వాన్నీ, సమానత్వాన్నీ తీసుకురాగల దన్న ఆశాభావం నా రచనల్లో వ్యక్తమవుతుంది. అందుకవసరమైన ప్రోత్సాహం వాళ్ళకు సరఫరా చేస్తుంది.

నా రచనలకు ఎంత పేరొచ్చిందంటే—


కొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్టమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
అమృతాంజన్ ఆముదము




మూడు సైజులలో
50 మిలి
100 మిలి
200 మిలి

OBM 3270 A/3RTG

ఒక ప్రముఖ పత్రిక ఒక ప్రత్యేక సంచికకుగానూ నా గేయాన్ని కోరింది. ఆఫీసులో వ్రాయడం మొదలుపెట్టాను. మండుటెండలో మలమల మాడే మానవుడా ఓ మానవుడా-నిండని కడుపుతో గిలగిలలాడే శ్రామికుడా ఓ శ్రామికుడా—ఎండుటాకులా.

నా రచన హఠాత్తుగా ఆగిపోయింది. కారణం వేరే ఏమీ లేదు. కరెంట్ ఫెయిలై గదిలో దీపం ఆరిపోయింది. అంతే అయితే గేయం వెంటనే వ్రాయగలిగి వుండేవాడినేమో-కానీ కరెంట్ ఫెయిల్ కావడానికి—ఎయిర్ కండిషనర్ లోపల ఏదో షార్టవడం కారణం కావడంతో — అది రెండు రోజుల వరకూ బాగుపడక పోవడంతో నేను రెండు రోజులవరకూ ఆ రచన జోలికి వెళ్ళలేకపోయాను.


## రచనా-లహరి

(శిక్షణా కేంద్రం)

నిర్వాహణ : మేఘశ్యామ్&రాధారాణి

కథలూ_నవలలూ వ్రాయటం ఎలా? ఈ అంశంపై ఆరు నెలల పోస్టలు ట్యూషను ద్వారా అందరికీ సులభంగా అర్థమయ్యే పద్ధతిలో కోర్సు రూపొందించబడింది.

ఉత్సాహవంతులైన సాహితీ ప్రియులు తమకు కావలసిన యితర వివరములకు స్వంత చిరునామా గల కవరు (125 పైసలు) జతపరుస్తూ వెంటనే వ్రాయండి.

మేఘశ్యామ్

8_8/6 శ్రీబాలాజీ సదన్,

ఖమ్మం.


ఎయిర్ కండిషనర్ బాగుపడ్డాక— గేయం పూర్తి చేశాక — నా శ్రీమతికి చూపించాను. అది చదివి కుసుమ భయపడింది. మీ రక్తం పీలుస్తూన్న నల్లుల్ని వెతికివెతికి కాలరాచి, మీ రక్తం పీల్చూస్తూన్న దోమల్ని చేయివేసి నలిపివేసి. మీ రక్తం పీలుస్తూన్న జలగల రక్తాన్నే కళ్ళజూసి .

ఈ వాక్యాలకే కుసుమ బెదిరిపోయి "ఎందుకండీ ఈ రెచ్చగొట్టే కవిత్వం . ." అంది కుసుమ.

నేను నవ్వి — "భయపడకు. ఈ కవిత్వం విని రెచ్చిపోయి విప్లవం తీసుకురావడానికి అన్నార్తులకి తీరుబడిలేదు. ఈలాంటి కవిత్వం వ్రాయడానికి-నాకున్నలాంటి సదుపాయాలుంటే కానీ కుదరదు. ఈ సదుపాయాలుండి ఈ కవిత్వం వ్రాసే వారివల్ల ఎవరికీ ప్రమాదమూ లేదు. ఇలా వ్రాయడంల్ల నాకేమో పేరు వస్తుంది. ఈ అనార్తులకీ, పీడితవర్గానికీ—నాబోటిగాళ్ళే నాయకులు. నాకు సంబంధించినంత వరకూ వాళ్ళు కేవలం నా కథావస్తువులు. అంతకుమించి వారిమీద నాకాసక్తిలేదు. అలాగే మరికొంత మందికి వారి వ్యథలే జీవనోపాధి.—ఇదీ సంగతి-" అన్నాను.

కుసుమ కర్థమైందో లేదో తెలియదు కానీ సంవత్సరాలు గడిచిపోతున్నా నా కథావస్తువులలా మార్పు లేకుండానే ఉంటున్నారు. నా రచనల్లో మాత్రం నానాటికీ కొత్తదనం వెల్లివిరుస్తోంది!

